క్లుప్తంగా

విద్యార్థుల ఎంపిక

గద్వాల: 2025–26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవెయిబుల్ స్కూళ్లలో 1–5వ తరగతి నాన్‌రెసిడెన్సియల్ గ్రూప్–3లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు రాకపోవడంతో గ్రూప్–1, గ్రూప్–2లలో నుంచి విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ సంక్షేమాభివృద్ధి శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ఈనెల 29న ఉదయం 11గంటలకు కలెక్టర్ కార్యాలయంలో లక్కీడిప్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో తనిఖీ



ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామంలోని కేజీబీవీ ని జిల్లా సమన్వయ అధికారి హంపయ్య తనిఖీ చేశారు. కేజీబీవీలో తరగతి గదులు, విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని ఎస్‌ఓ పరిమళకు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఇంటర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి

అయిజ: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగాల్లో చదివేందుకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ఎస్‌ఓ చెన్నబసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ విభాగంలో 7 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో 10 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఉచిత విద్య, వసతి, భోజన సదుపాయం కలిగిన జూనియర్ కళాశాలలో చదివేందుకు అర్హతకలిగిన విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రేపు గద్వాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

గద్వాల: ఈనెల 27న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు గద్వాలకు రానున్నట్లు ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9:30గంటలకు డీకే బంగ్లాకు చేరుకుని మీడియా సమావేశంలో మాట్లాడతారని పేర్కొన్నారు. అనంతరం 10గంటలకు ఎస్వీ ఈ వెంట్ హాల్లో ఏర్పాటు చేసిన మేధావుల సదస్సులో పాల్గొని, అక్కడే బీజేపీ కార్యకర్తలతో స మావేశం అవుతారని తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మల్దకల్: మోటారుసైకిల్ అదుపుతప్పి కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మల్దకల్ దగ్గర చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. కుర్తిరావల్‌చెర్వు గ్రామానికి చెందిన కుర్వకిష్టన్న, చిన్నసవారన్నలు కలిసి మోటారు సైకిల్‌పై గద్వాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, మల్దకల్ రైస్ మిల్లు దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

15 వాహనాలు సీజ్

గద్వాల క్రైం: మోటార్ వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న 15 బైక్‌లను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఆర్‌ఎస్‌ఐ బాలచంద్రుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన బైక్‌లకు నంబర్ ప్లేట్లను తొలగించడం, విరగొట్టి ట్రాఫిక్ సమస్యలకు కారకులయ్యారన్నారు. దీంతో తనిఖీలో వాటిని గుర్తించి 15 బైక్‌లను సీజ్ చేసినట్లు ఆర్‌ఎస్‌ఐ తెలిపారు.

చీటింగ్ కేసులో ఒకరికి రిమాండ్

గద్వాల క్రైం: లేని స్థలానికి ఇంటి నంబర్ సృష్టించి ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రుణం తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన గోపాల్ పట్టణ శివారులోని శ్రీనువాసులకు సంబంధించిన స్థలానికి ఇంటి నంబర్ సృష్టించాడు. వాటి ఆధారంగా ప్రైవేట్ ఫైనాన్స్‌లో రుణం తీసుకున్నాడు. బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చే సుకుని సదరు వ్యక్తిని కోర్టులోహాజరు పరుచగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదే స్థలంపై ఇరువురి మధ్య కొన్నిరోజుల క్రితం వివాదం చోటు చేసుకున్న సంఘటన విధితమే.

వ్యక్తిపై దాడి

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపంలోని క్యాతూరు గ్రామానికి చెందిన వెంకటేష్ దాబా నిర్వహిస్తున్నాడు. శుక్రవారం దాబాలో క్యాతూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శ్రీనివాసులు, ఆంజనేయులు దాబా యజమాని వెంకటేష్‌పై దాడి చేశారు. దీంతో వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

పంచాయతీల్లో పైసల్లేవ్!



చాగాపురంలో రోడ్డుపై నిలిచిన నీరు



బుడ్డారెడ్డిపల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగు

- నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు
- గ్రామాల్లో కుంటుపడిన పారిశుద్ధ్యం పనులు
- నిర్వహణ భారమైందంటున్న కార్యదర్శులు
- నెలలుగా ప్రజల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లి: పంచాయతీల్లో పాలకవర్గాల పాలన ముగిసి 19 నెలలు కావస్తున్నా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతూనే ఉంది. అప్పటి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలక వర్గాలుంటే మాత్రమే వచ్చే ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడో నిలిచి పోవడంతో పంచాయతీల్లో పాలన కుంటుపడింది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడం, సామగ్రి కొనుగోలు చేయడం, ట్రాక్టర్ డీజిల్, నిర్వహణ, వీధి దీపాలు, మంచి నీటి నిర్వహణకు తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిధ కార్యక్రమాల ఖర్చు మొత్తం కలిసి తడిసి మోపెడవుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం, సొంత డబ్బులు ఖర్చు చేయలేక నిత్యం పారిశుద్ధ్య పనుల నిర్వహణ భారమవ్వడంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిన నిధులు..

షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతూనే ఉంది. గతేడాది జనవరిలో పంచాయతీల పాలక వర్గాల గడువు పూర్తి కాగా, అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు ఎప్పుడో నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో కనీస అవసరాలు తీరకపోవడంతో పంచాయతీల్లో పాలన కుంటుపడింది.

సీజనల్ వ్యాధులు షురూ..

ప్రస్తుతం వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశాలు ఉన్నాయి. దీనికి పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకం. వాటికి నిధుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఒక్కో కార్యదర్శి ఏడాది కాలంగా రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు సొంత, ఇతరుల సహకారంతో ఖర్చు చేశారు. అందులో చిల్లిగవ్వ కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదు. కేవలం మల్టీపుల్ వర్కర్ల వేతనాలు మాత్రమే గ్రామ పంచాయతీ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తోంది.

మార్చి 2023 నుంచి జీపీలకు నిధులు బంద్..

పంచాయతీలకు సాధారణంగా మూడురకాలుగా నిధులు వస్తాయి. పన్ను రూపంలో వసూలైన మొత్తాన్ని జనరల్ ఫండ్ ద్వారా ఖర్చు చేసుకోవడం, ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం నిధులు మంజూరు చేయడం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు రావడం జరుగుతుంది. ఈ నిధులతోనే పంచాయతీల్లో పనులు జరుగుతాయి. 2023 మార్చి నెల నుంచి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి వచ్చే నిధులు మంజూరు కావడం లేదు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు నిధులను విడుదల చేస్తారు. ఒక్కో వ్యక్తికి సంవత్సరంలో రూ.1680 చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది ఇచ్చే నిధులను ఐదు శాతం పెరగాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు పెండింగ్ నిధులు కూడా రాని పరిస్థితి ఉంది.

పర్యవేక్షణ సరే, పారిశుద్ధ్య పనులు ఎలా?

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చెత్త సేకరణ సమాచారం తెలుసుకునేందుకు తీసుకొచ్చిన డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్‌ఆర్) అప్లికేషన్‌ను గతంలో పక్కన బెట్టిన పంచాయతీ కార్యదర్శులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఎట్టకేలకు ఇటీవల అంగీకరించారు. ఇటీవల హైదరాబాద్‌లో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులతో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రత్యేక పాలన అధికారులు అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. కానీ నిధులే లేనప్పుడు ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు ఎలా చేపట్టాలనే ఆందోళన కార్యదర్శులను వేధిస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక వర్గాలను ఏర్పాటు చేసి నిధులను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విధులు నిర్వహించలేక పోతున్నాం..



గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో విధులు నిర్వహించలేకపోతున్నాం. స్వచ్ఛదనం–పచ్చదనం పేరుతో ఒక్కసారి మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.50వేలు, చిన్న గ్రామ పంచాయతీలకు రూ.25వేలు మాత్రమే ఉపాధి హామీ ద్వారా విడుదల చేసింది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనుల కోసం సొంతంగా రూ.1,70,000 వరకు ఖర్చు చేశాను. నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు, కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నాం.

– లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి

కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం..



పాలక వర్గాల పదవీకాలం పూర్తయ్యాక ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడం లేదు. కానీ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పనులను చేపట్టాలని పంచా యతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం. కొత్త పాలక వర్గాలు ఏర్పడగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధు లు విడుదల అవుతాయి. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు సొంతంగా ఖర్చు చేస్తున్నారు. ఇటీవల పెద్ద జీపీలకు రూ. 25వేలు, చిన్న జీపీలకు రూ. 20వేల వరకు జిల్లా నుంచి ప్రత్యేక నిధులు అందించాం. ఎక్కువ సమస్యలున్న గ్రామాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధుల ద్వారా పనులు పూర్తి చేయిస్తాం.

– మహ్మద్ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, ఎంపీడీఓ, ఎర్రవల్లి.

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేద్దాం



అయిజ: అనేక సంవత్సరాలుగా పంట పొలాల్లో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల భూమితో పాటు గాలి, నీరు కలుషితమయ్యాయి. ఇక నుంచి రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లోని రైతువేదిక భవనంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మండలంలో మొత్తం 250 ఎకరాలు సేకరించామన్నారు. పశువులు ఉన్న రైతులకు మాత్రమే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందన్నారు. ఇకనుంచి సేంద్రియ ఎరువులకు బదులుగా నానో యూరియా, నానో డీఏపీ లాంటి ఎరువులు ద్రవరూపంలో పంటలకు పిచికారీ చేయాలన్నారు. ఉద్యానవన అధికారి మహేష్ మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేయాలనుకునే రైతులు వాటికి బ దులుగా ఆయిల్ ఫాంను సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రతినెల పంట చేతికొస్తుందని, ఉద్యోగుల మాదిరిగా రైతులకు ప్రతినెల ఆదాయం ఉంటుందన్నారు. రైతులు ఆయిల్ ఫాం తోటలవైపు మొగ్గుచూపాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మానవపాడు: పాఠశాలలో, వసతిగృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యతను పాటించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాల, కేజీబీవీ, పాఠశాల కాంప్లెక్స్ సమావేశం, భవితకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవితకేంద్రంలో దివ్యాంగులతో ఇంటరాక్ట్ కావడం జరిగింది. జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో విద్యార్థుల సామర్థ్యాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓను అభివృద్ధి చేయాలి

అయిజ: రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ)ను అభివృద్ధి చేయాలని ఆ సంస్థ మండల చైర్మన్ సుధాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ సపోర్టెడ్ అగ్రికల్చర్ (సీఎస్‌ఏ) రమేష్, వీరబాబులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ డైరెక్టర్లు, సభ్యులతో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఫ్‌పీఓ చైర్మన్ సుధాకర్ గౌడ్‌తోపాటు సీఎస్‌ఏలు మాట్లాడారు. 2022 జూన్‌లో ఎఫ్‌పీఓ సంస్థను స్థాపించారని పేర్కొన్నారు. అయిజ, గట్టు, వడ్డేపల్లి, రాజోళి, ఇటిక్యాల మండలాల రైతులతో సభ్యత్వం చేయించామని, ఇప్పటి వరకు అయిజ మండలంలో అత్యధికంగా 850 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓకు సంబంధించి ప్రతి గ్రామానికి ఒక డైరెక్టర్‌ను నియమించాలన్నారు. సభ్యత్వం పొందిన రైతులకు 300 ఎకరాల వరకు పండ్ల తోటల మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వాటితోపాటు అంతర్ పంటగా సాగుచేసేందుకు సీతాఫలం, గెట్ల వెంట నాటేందుకు ఎర్ర చెందనం, కొమ్మరి మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. పండ్ల తోటలను సాగుచేసేందుకు ఎరువులను సరయైన ధరలకు సంస్థ నుంచి అందించేందుకు అయిజలో దుకాణం ప్రారంభించామన్నారు. మండలంలోని సింధనూరు, పులికల్ గ్రామాల్లో త్వరలో దుకాణాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ వినీత్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



మానవపాడు: మండలంలోని మద్దూరులో శుక్రవారం ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మొక్కలు నాటడం భవిష్యత్ తరాలను ఉపయోగకరమన్నారు. ప్రతి ఒక్కరూ వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై సమీక్ష



ధరూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ధరూరు: వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియా నాయక్ హాజరయ్యారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే వివిధ పథకాలైన వ్యవసాయ యాంత్రీకరణ, నూనె గింజలు, ఆయిల్ పాం తోటలు వంటి వ్యవసాయ పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీలత, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి



ధరూరు: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ రవీంద్రబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని ఉప్పేరులో ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ని ర్వహించారు. ఈ సందర్భంగా అభ్యసన అభివృద్ధి, ఎఫ్ఎల్ఎన్, ఆన్‌లైన్ అటెండెన్స్ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ నోడల్ అధికారి గౌరీశంకర్ మాట్లాడారు.

వికసించిన బ్రహ్మకమలం



మానవపాడు: ఎక్కడో హిమాలయ ప్రాంతాలకే పరిమితమైన బ్రహ్మ కమలం ఇప్పుడు పలు ఇళ్లలో వికసిస్తోంది. శుక్రవారం బ్రహ్మకమలం మానవపాడు మండలంలోని అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర ఇంట్లో వికసించింది. బ్రహ్మను పోలి ఉన్న కారణంగా ఈ పుష్పానికి సుమిత్ర కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పుష్పాన్ని చూడటం ద్వారా మానసిక రుగ్మతలు, అనారోగ్యాలు తొలగుతాయని పురణాలు చెబుతున్నాయి. ఉత్తరఖాండ్ రాష్ట్ర పుష్పమైన బ్రహ్మకలమం.. ఈ పుష్పం ఎక్కువగా హిమాలయాల్లో మాత్రమే కనిసిస్తుంది. అనేక సామాజిక మధ్యమాల్లో సైతం ప్రజలు హల్‌చల్ చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గెలుపు వైపు అడుగులు వేయండి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని, ప్రతి ఒక్క క్రీడాకారుడు గెలుపుకోసం అడుగులు వేయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తనూరులోని ప్రొఫెసర్ జయశంకర్ విద్య క్రీడా ప్రాంగణంలో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మక్సూద్ బీన్ అహ్మద్, పృథ్వీశ్వర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గౌతమ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో మాజీ ప్రసిడెంట్ రాముడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

రాజోళి: విద్యతో పాటు విద్యార్థులకు ఆటలు ఆడించడం వల్ల మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓ భగీరథ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల హాజరు శాతం, మౌలిక వసతుల కల్పనపై ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఫౌండేషన్ వారు విద్యార్థులకు ఆట వస్తువులను అందించి, వారితో ఆడించారు. దినచర్యలో భాగంగా ఆటలు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. వెనకబడిన విద్యార్థులకు ఎంవీ ఫౌండేషన్ రూపొందించిన 'నెమ్లికా' అనే పుస్తకాన్ని అందించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి, కాకే సుధాకర్, బసవరాజు, అబ్దుల్ రహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధులపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యురాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్, రిజనల్ వ్యాధులపై మానవపాడు పీహెచ్‌సీ వైద్యురాలు హేమమానస వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఒక విద్యార్థికి థైరాయిడ్ గుర్తించారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ ఎలిజిబిత్ సుహాసిని, వసతి గృహం వార్డెన్ శేషన్న, వైద్య సిబ్బంది చంద్రన్న, అక్కమ్మ, సుబాసిని, వినోదిని, పంచాయతీ కార్యదర్శి బాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ధరూరు: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే మంచి ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ ఆయేషా బేగం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెద్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని గుడ్డెందొడ్డి గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మండలంలోని మార్లబీడు గ్రామం శివారులోని జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టు: సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు శుక్రవారం వైద్యాధికారులు వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారి సూర్యప్రకాష్ వైద్య పరీక్షలను నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వసతిగృహంలో మొత్తం 40 మంది విద్యార్థులు ఉండగా, 10 మంది విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో వార్డెన్ బస్వరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కోసం విద్యార్థుల ఆందోళన



ఆర్టీసీ బస్సును అడ్డగించిన విద్యార్థులు

ధరూరు: ఏడు గ్రామాల విద్యార్థులకు ప్రధాన ఆధారమైన ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని ఆయా గ్రామాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఉప్పేరు గ్రామంలో గద్వాల నుంచి వచ్చిన నెట్టెంపాడు బస్సును గంటపాటు అడ్డగించారు. వర్షంలోని తడుస్తూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, ఉప్పేరు, గార్లపాడు, కమ్మంపాడు, నీలహళ్లి గ్రామాలకు నిత్యం ఒకే బస్సును నడుపుతుండటంతో విద్యార్థులకు సరిపోవడం లేదు. దీంతో అదనంగా మరో బస్సును నడపాలని ఆందోళన చేశారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు ఈ విషయాన్ని డీఎంకు ఫోన్ ద్వారా వివరించారు. సాధ్యమైనంత త్వరలో అదనపు బస్సు నడుపుతామని డీఎం చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

గద్వాలన్యూటౌన్: స్థానిక ప్రభుత్వ ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్తెమ్మకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందించారు. ప్రొఫెసర్ విజయలక్ష్మీ పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి డాక్టరేట్ అవార్డును పొందింది. సత్తెమ్మ డాక్టరేట్ పట్టా సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, ఇతర అధ్యా పక బృందం అభినందనలు తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల: నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో ఎంఎల్‌హెచ్‌ల నియామకం జరిగిందని, నిబంధనల మేరకు వారికి చెల్లించాల్సిన వేతనాలు చెల్లించడం లేదని, దీనిపై సుప్రీం కోర్టు సైతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలలో చలనం లేకుండా పోయిందన్నారు. వీరి సమస్యలపై ప్రత్యేక్ష కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా కార్యక్ర మాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. హైమావతి, సుజా త, శివతేజ, శిరీష వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు ప్రారంభం

రాజోళి: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం శ్రావణమాస పూజలు ప్రారంభమయ్యాయి. శ్రావణమాసం సందర్భంగా తుంగభద్ర నది మధ్యలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పుట్టీల ద్వారా వెళ్లి విశేష పూజలు చేశారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పార్వతిదే వి ఆలయంలో, అంభభవానిమాత ఆలయంలో స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మా సం ముగిసేదాకా ప్రతి శుక్ర వారం అమ్మవారికి పూజలు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

పాఠ్య ప్రణాళికపై చర్చ

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం విజయభాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ బోధన విధానం ప్రణాళికపై చర్చించి బడిబయటి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. పాఠశాల విధులకు సమయపాలన పాటించాలని, లైబ్రరీ బుక్స్ నిర్వాహన, సులభమైన పద్ధతిలో బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శివరాజ్. చంద్రశేఖర్, అనిత, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో శుక్రవారం సీతారామాంజనేయ దేవస్థానం నిర్మాణానికి భక్తులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ధర్మారెడ్డి, లక్ష్మీదేవమ్మ, పద్మావతి, వెంకట రమణారెడ్డి, ప్రసన్నలక్ష్మి, మల్లికార్జున్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనందించాలి

కేటీదొడ్డి: ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెల్పింగ్‌హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రత్నసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నందిన్నె, చింతలకుంట, కుచినెర్ల, కొండాపురం పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు హాజరై మెటీరియల్ అందజేశారు. అనంతమ్మ, వేమా రెడ్డి జ్ఞాపకార్థం సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

మానవపాడు: మండలంలోని పోతులపాడు, చెన్నిపాడు, అమరవాయి, పల్లెపాడు, జల్లాపురం, బోరవెల్లి, నారాయణపురం, పెద్దఆముదాలపాడు గ్రామాల ప్రజలకు అదనపు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం మండలకేంద్రంలోని బీజేపీ నాయకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో గద్వాల డిపో మేనేజర్ సునితకు వినతిపత్రం అందించారు. విద్యార్థులకు, మహిళలకు, రోగులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.